విజయనగరయుగం

విజయనగరస్థాపన రెడ్డినాయక రాజ్యాలతోబాటే జరిగింది. దాక్షిణాత్య చరిత్రలోనేగాక యావద్భారత చరిత్రలోనే విజయనగరయుగం ఒక ముఖ్య మట్టంగా రూపొందింది. ఓరుగల్లు పతనానంతరం కృష్ణానదికి దక్షిణదేశాన్ని సమైక్యంచేసీ తురుష్కవిస్తరణను అరికట్టి సుమారు రెండున్నర శతాబ్దాలకాలం హిందూ మత సంస్కృతులకు రక్షణ కల్పించింది. దక్షిణదేశంలో హిందూ సంస్థలు స్వచ్ఛంగా ఉండడానికి కారణంకావడమేగాక దేశవ్యాప్తమైన హిందూ పునర్జీవనానికి ప్రోత్సాహం సమకూర్చింది. బహమనీలతో ఎడతెగని పోరాటాలు సాగించినందున సుల్తానుల దృష్టి దక్షిణాపథరాజకీయాల్లోనే లగ్నమై ఢిల్లీ సామ్రాజ్య పతన కాలంలో వారు ఉత్తరంగా విస్తరించే అవకాశం లేకుండా చేసింది. బహమనీలు ఢిల్లీని ఆక్రమించివుంటే భారత చరిత్రలో మొగల్ యుగం అనుమానాస్పదమయి ఉండేది. ఈ విధంగా విజయనగరం మధ్యయుగ రాజకీయాల్లో కీలకపాత్ర నిర్వహించింది. విజయనగరా ధీశులు సంస్కృతీప్రియులై సంస్కృతాన్ని దక్షిణాత్యభాషా సారస్వతాలను పోషించి నారు. ముఖ్యంగా విజయనగరం ఆంధ్రులు గర్వించదగిన కాలం. ఈ కాలంలో ఆంధ్ర సంస్కృతి దాక్షిణాత్య ప్రజలందరి ఆదరణ పొందింది. ఆంధ్రభాషా కవులు విజయనగరాస్థానకవులయినారు. ఆంధ్రశిల్పరీతి, సంగీతం దాక్షిణాత్యు లందరికీ ఆదర్శములయినాయి. దక్షిణదేశమంతటా తెలుగువారి రాజకీయ సాంస్కృతిక స్థావరాలేర్పడినాయి

అయితే విజయనగరాధీశులు ఆంధ్రదేశ సమైక్యాన్ని సాధించలేకపోయి నారు. వారి ఆధికారం చాలవరకు కృష్ణానది దక్షిణప్రాంతానికి మాత్రం పరి మితమయింది. ముసునూరు, పద్మనాయక రాజ్యాలు అస్తమించిన తరువాత తెలంగాణం బహమనీలు ఆక్రమించినారు. రెడ్డిరాజ్యాలపతనంతో ఉత్తరాంధ్రం గజపతులకు బహమనీలకు జరిగిన యుద్ధాలకు రంగస్థలమై తీరని బాధ లనుభవించింది.

విజయనగర స్థాపన

విజయనగర స్థాపననుగురించి విభిన్న సిద్ధాంతాలున్నాయి విజయనగర వైభవాన్ని వెలుగులోనికి తెచ్చిన రాబర్ట్ సూయల్ తన "విస్మృత విజయనగర